
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023



స్వగ్రామాల్లో సంబురం !

ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురికి నూతన మంత్రివర్గంలో స్థానం దక్కడంతో వారి స్వగ్రామాల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. 8లో



నేటితో వారోత్సవాల ముగింపు

మావోయిస్టు పార్టీ నిర్వహిస్తున్న పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ వారోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. 8లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రిపూట చలి ప్రభావం అధికంగా ఉంటుంది.

మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వేదికపై గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు







ముచ్చటగా ముగ్గురు!

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరగా... ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురికి మంత్రివర్గంలో చోటు లభించింది. ఉమ్మడి జిల్లా రాజకీయ చరిత్రలో ముగ్గురికి అవకాశం దక్కడం ఇదే తొలిసారి కావడం విశేషం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తర్వాత డిప్యూటీ సీఎంగా మల్లు భట్టి విక్రమార్క ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే, ఆరో వరుసలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పదో వరుసలో తుమ్మల నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం జరిగింది. ఇందులో భట్టి, తుమ్మల దైవసాక్షిగా, పొంగులేటి పవిత్ర హృదయంతో ప్రమాణ స్వీకారం చేశారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

జిల్లా నుంచి మంత్రివర్గంలో త్రిమూర్తులు

- ఉప ముఖ్యమంత్రిగా మల్లు భట్టివిక్రమార్క
- మంత్రులుగా పొంగులేటి, తుమ్మల ప్రమాణస్వీకారం
- ఉమ్మడి జిల్లాలో ముగ్గురికి పదవులు ఇదే తొలిసారి
- కాంగ్రెస్ విజయంలో కీలకపాత్ర పోషించిన నేతలకు పట్టం

భట్టికి ఉన్నత పదవి

అంతా అనుకున్నట్లే భట్టికి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నత పదవి లభించింది. సీఎం పదవి కోసం భట్టి పోటీ పడినా.. చివరకు అధిష్టానం ఆయనను డిప్యూటీ సీఎం పదవితో సంతృప్తపరిచింది. జలగం వెంగళరావు తర్వాత ఉమ్మడి జిల్లాకు దక్కిన అత్యున్నత పదవి ఇదే. రేవంత్‌రెడ్డి తర్వాత అటు పార్టీ, ఇటు ప్రభుత్వంలో ప్రస్తుతం ఆయన కీలక నేతగా వ్యవహరించనున్నారు. గత ప్రభుత్వాల్లో పనిచేసిన అనుభవం ఉండటంతో భట్టి నేతృత్వాన ప్రజా సమస్యలు త్వరగా పరిష్కారం కానున్నాయని అనుచర నేతలు పేర్కొంటున్నారు. వైఎస్ ప్రభుత్వంలో ఓ వెలుగు వెలిగిన భట్టి 2009 నుంచి వరుసగా విజయం సాధిస్తూ వచ్చారు.

ప్రజలకు శీనన్నగా..

మాజీ ఎంపీ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజకీయాల్లో తన ప్రత్యేకతను చాటుకున్నారు. అతి తక్కువ కాలంలోనే మాస్ లీడర్‌గా ఎదిగి.. రాజకీయాలను శాసించే స్థాయి పొందారు. తొలుత కాంట్రాక్టర్‌గా పనిచేసిన పొంగులేటి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డిపై ఉన్న అభిమానంతో 2013 ఫిబ్రవరి 23న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014లో తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పొంగులేటి అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఖమ్మం ఎంపీగా గెలిచారు. ఆయనతోపాటు పార్టీ నుంచి మరో ముగ్గురు ఎమ్మెల్యేలు, పొత్తులో భాగంగా భద్రాచలంలో సీపీఎం అభ్యర్థి సున్నం రాజయ్య గెలుపునకు కృషి చేశారు. పాలేరు ఉప ఎన్నికల సమయాన 2016 మే 3న బీఆర్ఎస్‌లో చేరిన పొంగులేటి ఆ తర్వాత జరిగిన పలు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం క్రియాశీలకంగా పనిచేశారు.

తిరుగుబాటు చేసి..

ఏడేళ్లపాటు బీఆర్ఎస్‌లో కొనసాగిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. కేంద్ర రవాణా, పర్యాటక, సాంస్కృతిక శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా, ఎనర్జీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేసిన సంప్రదింపుల కమిటీలో సభ్యుడిగా పనిచేశారు. ఆ తర్వాత పార్టీలో తనకు సముచిత స్థానం దక్కలేదనే కారణంతో ఈ ఏడాది జనవరి 1న పార్టీపై తిరుగుబాటు చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తుండడంతో ఆయనను ఏప్రిల్ 10న బీఆర్ఎస్ సస్పెండ్ చేసింది. అనంతరం జూలైలో ఖమ్మంలో జరిగిన జన గర్జన బహిరంగ సభలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షాన కాంగ్రెస్‌లో చేరిన పొంగులేటిని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్‌గా నియమించింది. ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 'తిరగబడదాం.. తరిమికొడదాం' పేరిట ప్రచారం నిర్వహించడమేకాక ఉమ్మడి జిల్లాలో గడపగడపకు కాంగ్రెస్‌ను తీసుకెళ్లారు. తొలిసారి ఎమ్మెల్యేగా తాజా ఎన్నికల్లో పాలేరు నుంచి గెలిచిన ఆయన మంత్రి పదవిని దక్కించుకున్నారు.

సముచిత గౌరవం

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయంలో అంతా తామై వ్యవహరించిన ముగ్గురు నేతలకు సముచిత గౌరవం దక్కింది. తెలంగాణ ఏర్పడ్డాక జరిగిన మొదటి రెండు ఎన్నికల్లో రాష్ట్రమంతటా బీఆర్ఎస్ సత్తా చాటినా ఇక్కడ మాత్రం కాంగ్రెస్‌కు అధిక స్థానాలు దక్కాయి. ఈసారి కూడా మెజార్టీ స్థానాలు దక్కడంలో భట్టి, పొంగులేటి, తుమ్మల కృషి ఉంది. వీరు తమ నియోజకవర్గాలే కాకుండా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రచారం చేస్తూ నాయకులను సమన్వయపరిచారు. దీంతో కార్యకర్తలు, నేతలు ఒకతాటిపైకి చేరగా కాంగ్రెస్ గెలుపు నల్లేరుపై నడకలా సాగింది. దీంతో ఈ ముగ్గురికి మంత్రివర్గంలో స్థానం దక్కగా.. హైదరాబాద్‌లో జరిగిన ప్రమాణ స్వీకారానికి ఉమ్మడి జిల్లా నుంచి అనుచర నేతలు భారీగా తరలివెళ్లారు.

మూడు ప్రభుత్వాల్లో మంత్రి

జిల్లా రాజకీయ చరిత్రలో 40 ఏళ్ల ప్రస్థానం సాగించిన నేత తుమ్మల నాగేశ్వరరావు. తెలుగుదేశం, బీఆర్ఎస్ హయాంలో మంత్రిగా పనిచేసిన ఆయనకు ప్రస్తుత కాంగ్రెస్ మంత్రివర్గంలోనూ స్థానం దక్కడం అరుదైన విషయంగా చెప్పుకోవాలి. 1985, 1995, 1996, 1999, 2001 ఏడాదిలో టీడీపీ హయాంలో చిన్ననీటి పారుదల శాఖ, ప్రొహిబిషన్, భారీ, మధ్యతరహా నీటి పారుదలశాఖ, ఎక్సైజ్, ఆర్అండ్‌బీ శాఖ మంత్రిగా విధులు నిర్వర్తించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 2014లో ఆర్అండ్‌బీ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన మంత్రిగా పనిచేసిన సమయాన ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి విశేష కృషి చేశారు. 2018లో పాలేరు నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి చేతిలో ఓటమి చవిచూశారు. ఈసారి బీఆర్ఎస్ టికెట్ కేటాయించకపోవడంతో కాంగ్రెస్‌లో చేరి ఖమ్మం నుంచి పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌పై ఘన విజయం సాధించారు. దీంతో ఆయనకు మంత్రి పదవి దక్కింది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అకాల వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ శిరీష



ఆరోగ్య ఉపకేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న శిరీష

చర్లరూరల్: ఇటీవల కురిసిన వర్షాలతో వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు అప్రమత్తంగా ఉంటూ చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష సూచించారు. మండలంలోని సత్యనారాయణ పురం ఆస్పత్రిని, కుర్నపల్లి, మామిడిగూడెం ఆరోగ్య ఉప కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. మౌలిక సదుపాయాల ఏర్పాటు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యాధులు ప్రబలితే అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఉత్తమ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ చైతన్య, సత్యనారాయణపురం వైద్యాధికారిణి దివ్యనయన, డీపీఓ దుర్గ, ఏఎన్ఎం సమ్మక్క, ఎంఎల్‌హెచ్‌పీ పార్వతి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి జిల్లాలో గల నిరుద్యోగ యువత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా రెండు నెలలు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు పీఓ ప్రతీక్‌జైన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం, సుదిమళ్ల(ఇల్లందు), మద్దులపల్లి(ఖమ్మం) యూత్ ట్రైనింగ్ సెంటర్ల(వైటీసీ)లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 18 – 23 ఏళ్ల వయసు గల, పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అదనపు గోడౌన్లకు ప్రతిపాదనలు అందించండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం




మాజీ సైనికులతో కలెక్టర్ ప్రియాంక అల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈవీఎంలు భద్రపరిచేందుకు అదనపు గోడౌన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోదాంను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గోదాం ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని చెప్పారు. గోదాంలో ఉన్న ఈవీఎం మెటీరియల్‌ను పరిశీలించి పటిష్ట పర్యవేక్షణ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శిరీష, తహసీల్దార్ పుల్లయ్య, ఆర్అండ్‌బీ ఈఈ భీమ్లా, డీఈ నాగేశ్వరరావు, ఎన్నికల విభాగం డీటీ రంగాప్రసాద్ పాల్గొన్నారు.

సైనికుల సేవలు అమూల్యం

దేశ రక్షణలో సైనికుల సేవలు అమూల్యమని కలెక్టర్ ప్రియాంక అన్నారు. ఫ్లాగ్ డే సందర్భంగా గురువారం తనను కలిసిన మాజీ సైనికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశాన్ని కాపాడేందుకు వీరమరణం పొందిన, పోరాటాన్ని కొనసాగించిన, విధి నిర్వహణలో ఉన్న వారిని గౌరవించేందుకు డిసెంబర్ 7న దేశ వ్యాప్తంగా సాయుధ దళాల పతాక దినోత్సవంగా పాటిస్తున్నామని తెలిపారు. దేశానికి గల గొప్ప ఆస్తుల్లో సైనికులు ఒకరని అన్నారు. మాతృభూమి సేవలో ప్రాణాలర్పించిన అమరులకు ఎప్పుడూ రుణపడి ఉండాలన్నారు. వారి కుటుంబాల పట్ల అభిమానం చాటడం కర్తవ్యమని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు జింకా అల్లూరయ్య, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, ఉపేందర్‌రావు, సత్యనారాయణ, మొయినుద్దీన్, డాంగే తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ రిక్త హస్తమే..



కొత్త కేబినెట్‌లో ఉమ్మడి జిల్లాకు మూడు మంత్రి పదవులు

- భద్రాద్రికి మాత్రం మరోసారి మొండిచేయి
- గతంలోనూ జిల్లాకు ఆశాభంగమే
- ప్రత్యేక జిల్లాగా ఏర్పడినా దక్కని ఫలాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణలో ఏర్పడిన మూడో ప్రభుత్వంలోనూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు నిరాశే మిగిలింది. గత రెండు కేబినెట్ల మాదిరిగానే మరోసారి ఉమ్మడి ఖమ్మం జిల్లా పేరుతో కేవలం ఖమ్మం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలకే మంత్రి పదవులు కట్టబెట్టారు.

ఆది నుంచీ అటే..

ఖమ్మం జిల్లా నుంచి విడివడి 2016 అక్టోబర్‌లో కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాలతో కలిపి భద్రాద్రి జిల్లా ఏర్పడింది. ఇందులో నాలుగు ఎస్టీ రిజర్వ్‌డ్ కాగా కొత్తగూడెం జనరల్ స్థానంగా ఉంది. తొలిసారి జరిగిన ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి అధికార బీఆర్ఎస్ తరఫున జలగం వెంకటరావు ఒక్కరే గెలుపొందినా.. అప్పుడు మంత్రి పదవి తుమ్మల నాగేశ్వరరావుకు దక్కింది. రెండోసారి ఖమ్మం ఎమ్మెల్యే అజయ్‌కుమార్ కేబినెట్‌లో బెర్త్ దక్కించుకున్నారు. మలి విడతలో పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుకు విప్ పదవి ఇచ్చి సరిపెట్టారు. తాజాగా జరిగిన మూడో అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో మూడు స్థానాలు అధికార కాంగ్రెస్ పార్టీకే దక్కాయి. దీంతో కేబినెట్ బెర్త్‌పై ఆశలు చిగురించాయి. కానీ తొలి విడత మంత్రివర్గంలో ఉమ్మడి జిల్లాకు మూడు బెర్త్‌లు దక్కగా అవన్నీ ప్రస్తుతం ఖమ్మం జిల్లాకే వెళ్లాయి. చివరి సారిగా ఉమ్మడి రాష్ట్రంలో కొత్తగూడెం నుంచి గెలిచిన వనమా వెంకటేశ్వరరావు వైద్య విధాన పరిషత్ మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత మళ్లీ ఆ స్థాయిలో ప్రస్తుత భద్రాద్రి జిల్లా నుంచి ఎవరికీ అవకాశం రాలేదు.

విభిన్నతలకు నిలయం..

ఉమ్మడి ఖమ్మం జిల్లాగా ఉన్నప్పటి నుంచీ ప్రస్తుతం ఉన్న భద్రాద్రి జిల్లా పరిధిలోని నియోజకవర్గాలు పాలనాపరంగా కీలకంగా ఉంటూ వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో ఖమ్మం మినహాయిస్తే మిగిలిన ప్రాంతమంతా ప్రధానంగా వ్యవసాయ ఆధారిత ప్రదేశమే. కానీ భద్రాద్రి జిల్లా పరిస్థితి అలా కాదు. తెలంగాణకే తలమానికమైన సింగరేణి బొగ్గు గనులు, ఆ సంస్థ ప్రధాన కార్యాలయం ఇక్కడే ఉన్నాయి. కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్, హెవీ వాటర్ ప్లాంట్, పేపర్ బోర్డు, పామాయిల్ ఫ్యాక్టరీలు, నవభారత్ వంటి పరిశ్రమలు ఉన్నాయి. జిల్లాలో దాదాపు 90 శాతం ప్రాంతం 1/70 చట్టం పరిధిలో ఉంటుంది. అటవీ విస్తీర్ణం ఎక్కువ. భద్రాచల పుణ్యక్షేత్రం, సీతారామ సాగునీటి ప్రాజెక్టు, ప్రతీ ఏడాది వచ్చే గోదావరి వరదలు ఇలా విభిన్నతలకు నిలయంగా భద్రాద్రి జిల్లా ఉంది. ఇలాంటి జిల్లాకు నేరుగా కేబినెట్‌లో బెర్త్ దక్కకపోవడం ప్రధాన లోటుగానే పరిగణించాలని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

లక్ష్యానికి దూరంగా

ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేసే లక్ష్యంతో కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారు. కానీ కేబినెట్ కూర్పులో ఇప్పటికీ పాత జిల్లానే పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఫలితంగా భద్రాద్రి లాంటి విభిన్నతలకు నెలవైన జిల్లాలో పాలన ఆశించిన వేగంతో సాగడం లేదనడంలో సందేహం అక్కర్లేదు. ఉదాహరణకు గోదావరికి వరదలు వస్తే ఖమ్మం నుంచి మంత్రులు వచ్చి భద్రాచలంలో మకాం వేసే వరకు సహాయక చర్యల్లో ఆశించిన పురోగతి కనిపించదు. అలాగే కొత్తగనులు, సాగునీటి ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి భూ సేకరణ, ఇతర అనుమతులు రావాలన్నా ఖమ్మం నుంచి మంత్రులు చొరవ చూపించేవరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా పరిస్థితులు నెలకొని ఉంటున్నాయి. అందుకే ఈ జిల్లాకు ఉన్న భౌగోళిక, సామాజిక ప్రత్యేకతలను దృష్టిలో ఉంచుకుని కేబినెట్‌లో చోటు కల్పించాలనే డిమాండ్ వస్తోంది.

ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నా..

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నుంచి జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలు విజయం సాధించారు. కాంగ్రెస్ మిత్రపక్షంగా కొత్తగూడెం నుంచి సీపీఐకి చెందిన కూనంనేని సాంబశివరావు ఎన్నికయ్యారు. ప్రస్తుత ఎమ్మెల్యేల్లో పాయం వెంకటేశ్వర్లు సీనియర్‌గా ఉన్నారు. అసెంబ్లీకి మూడోసారి ఎన్నికయ్యారు. ఆ తర్వాత కోరం కనకయ్య రెండోసారి గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు. కూనంనేని సాంబశివరావు సైతం రెండోసారి గెలిచారు. అయితే లాబీయింగ్ చేయడంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు విఫలం కావడం, కేబినెట్ కేటాయింపుల్లో ఇంకా ఉమ్మడి జిల్లానే ప్రాతిపదికగా తీసుకుంటుండటంతో వరుసగా మూడోసారి కూడా భద్రాద్రి జిల్లాకు నిరాశే మిగిలింది. రాబోయే రోజుల్లో చేపట్టబోయే మంత్రివర్గ విస్తరణలో అయినా ఈ జిల్లాకు న్యాయం జరుగుతుందో లేదో వేచి చూడాలి. ఇక భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లికి చెందిన తుమ్మల నాగేశ్వరరావుకు కేబినెట్‌లో బెర్త్ దక్కడం ఒక్కటే ఊరట కలిగించే అంశం. మరోమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు జిల్లాలో ఉండటం మరో అదనపు ప్రయోజనం అనుకుని సరిపెట్టుకోవాల్సిందే.

తుపానుతో పొగాకు పంటకు తీవ్రనష్టం


పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్



దెబ్బతిన్న పొగాకు పంటను పరిశీలిస్తున్న చైర్మన్ యశ్వంత్, తదితరులు

అశ్వారావుపేటరూరల్: మిచాంగ్ తుపాను కారణంలో పొగాకు పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ తెలిపారు. ఏపీలోని జంగారెడ్డిగూడెం పొగాకు బోర్డు పరిధిలో ఉన్న అశ్వారావుపేటతోపాటు పలు ప్రాంతాల్లో గురువారం పర్యటించి దెబ్బతిన్న పొగాకు తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం కేంద్రం పరిధిలోనే దాదాపు వెయ్యి ఎకరాల్లో పొగాకు తోటలు దెబ్బతిన్నాయని, వందల ఎకరాల్లో స్వల్పంగా నష్టం జరిగిందని చెప్పారు. రైతులు ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు నష్టపోయారని తెలిపారు. గతంలో కూడా తుపాను, వర్షాల కారణంగా పొగాకు పంటలకు నష్టం జరిగిన నేపథ్యాన, విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితులకు సాయం అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం ఆదిశేషయ్య, సూపరింటెండెంట్ జె.సురేంద్ర, ఫీల్డ్ ఆఫీసర్లు జేసీ.ప్రభాకర్‌రెడ్డి, బాలాజీ, కె.వెంకయ్య, రైతు సంఘం బాధ్యులు సత్రం వెంకట్రావు, గడ్డమడుగు సత్యనారాయణరెడ్డి, రెడ్డిబాబు, కలపాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది రానీయొద్దు



మాట్లాడుతున్న ఆర్డీఓ మంగీలాల్, పక్కన ఆలయ ఈఓ రమాదేవి తదితరులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 13 నుంచి జనవరి 2 వరకు నిర్వహించే వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్ అధికారులను ఆదేశించారు. ఆలయ ఈఓ రమాదేవితో కలిసి తన కార్యాలయంలో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 22న తెప్పోత్సవం, 23న ఉత్తర ద్వార దర్శనం వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. గతంలో బాణసంచా కాల్చే సమయంలో తలెత్తిన ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడాలని అగ్నిమాపక సిబ్బందిని ఆదేశించారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, రోడ్ల మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. పలుచోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ప్రతీ ఒక్కరు సమన్వయంతో పని చేసి వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ సీఐ నాగరాజు రెడ్డి, ఎస్ఐ పీవీ.రావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, అల్లం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు గోదావరికి మహా హారతి

కార్తీక మాసం సందర్భంగా ఈనెల 9న 'గోదావరి నదీ హారతి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పవిత్ర గోదావరి నది తీరంలో సాయంత్రం 5 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

సింగరేణి 'గుర్తింపు' ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కట్టా బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 27న జరుగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ఏర్పాట్లపై సంస్థ ప్రధాన కార్యాలయంలో పర్సనల్ జీఎం(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ కేవీఆర్‌కే ప్రసాద్‌తో గురువారం సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు 24 పోలింగ్ బూత్‌లు, 72 పోలింగ్ బాక్స్‌లు అవసరమని చెప్పారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు కలిపి 124 మంది, ఓట్ల లెక్కింపునకు 57 మంది కౌటింగ్ సూపర్‌వైజర్లు, కౌటింగ్ అసిస్టెంట్లను కేటాయించాలని కోరారు. ఉన్నతాధికారులతో చర్చించి సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. సమావేశంలో సింగరేణి అధికారులు కోడూరు శ్రీనివాసరావు, పి.వేణుగోపాల్‌రావు, వైవీఎల్ వరప్రసాద్, హరిశంకర్, జీకే కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటితో ముగియనున్న పీఎల్‌జీఏ వారోత్సవాలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

చర్ల: మావోయిస్టు పార్టీ పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ 23వ వారోత్సవాలు నేటితో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో ఏజెన్సీలో పోలీసులు చేపట్టిన తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 2 నుంచి 8 వరకు పీఎల్‌జీఏ వారోత్సవాలు నిర్వహించాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చిన విషయం విదితమే. అయితే విధ్వంసాలకు దిగవచ్చనే అనుమానంతో మండలంలోని పలు గ్రామాలతో పాటు తెలంగాణా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో వారం రోజులుగా పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. సరిహద్దుకు వెళ్లి వచ్చే వారిని ఆపి వివరాలు ఆరా తీస్తున్నారు. సీఐ బి.రాజగోపాల్, ఎస్సైలు చంద్రశేఖర్, టీవీఆర్ సూరి సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసులతో తనిఖీలు చేపడుతున్నారు.

కరాటే పోటీల్లో వైష్ణవి ప్రతిభ

అశ్వాపురం: అండర్–17 రాష్ట్రస్థాయి కరాటే టోర్నమెంట్‌లో అశ్వాపురం జెడ్పీ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని తోడేటి వైష్ణవి ప్రతిభ చూపి ద్వితీయ స్థానం సాధించింది. నల్లగొండలో గురువారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో కరాటే మాస్టర్ మురుగన్ ఆధ్వర్యంలో విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకోటమైసమ్మ తల్లికి కంఠహారం



హారం అందజేస్తున్న భారతి తండ్రి

కారేపల్లి: కారేపల్లి మండలంలోని ఉసిరికాయలపల్లిలో కొలువైన శ్రీకోటమైసమ్మతల్లికి ఓ భక్తురాలు రూ.1.25లక్షల విలువైన కంఠహారాన్ని సమర్పించారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన కడియాల భారతికి అమెరికాలో ఉద్యోగం రాగా, ఆమె తండ్రి కోటేశ్వరరావు కంఠహారాన్ని గురువారం ఆలయ ఈఓ కొండకింది వేణుగోపాలాచార్యులు, ఆలయ ధర్మకర్త పర్సా పట్టాభిరామారావుకు అందజేశారు. అర్చకులు కొత్తలంక కైలాషశర్మ, సిబ్బంది మూడ్ మోహన్, లలిత్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

తల్లాడ: మండలంలోని మంగాపురం క్రాస్ వద్ద గురువారం తెల్లవారుజామున ట్రావెల్ బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. రాజమండ్రి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ట్రావెల్ బస్సు అతివేగం కారణంగా అదుపు తప్పింది. దీంతో రోడ్డుపక్కన గుంతలోకి దూసుకెళ్లి ఓ పక్కకు ఒరిగి ఆగిపోయింది. ఆ సమయాన బస్సులో 40 మంది ప్రయాణికులు ఉండగా కొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయితే, పెను ప్రమాదం తప్పడం అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈమేరకు ప్రయాణికులను మరో బస్సులో హైదరాబాద్ పంపించారు.

పక్కింట్లో రూ.24 వేలు కొట్టేసిన విద్యార్థి

చెట్టుపై దాయడంతో వర్షానికి తడిసిన నోట్లు

నేలకొండపల్లి: ఫోన్ కొనాలనే భావనతో పక్కింట్లో నగదు చోరీ చేసిన ఏడో తరగతి విద్యార్థి ఆ డబ్బును చెట్టుపై దాయగా, తాజా వర్షానికి నోట్లు తడిసి ముద్దయ్యాయి. ఈ విషయం తెలియంతో ఉపాధ్యాయులు ఆయనకు కౌన్సెలింగ్ ఇచ్చి నగదు రికవరీ చేశారు. నేలకొండపల్లి మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి నాలుగు రోజుల క్రితం పక్కింట్లో రూ.24 వేల నగదు చోరీ చేశాడు. అయితే, డబ్బు ఖర్చు పెట్టేందుకు భయపడిన ఆయన కొద్ది రోజుల తర్వాత ఫోన్ కొనాలనే భావనతో డబ్బును ఇంట్లోని ఓ చెట్టుపై దాచాడు. కాగా, సదరు విద్యార్థిపై అనుమానం రావడంతో గురువారం బాధితులు ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు చాకచాక్యంగా కౌన్సెలింగ్ చేయగా చోరీ విషయం బయటపడింది. అనంతరం చెట్టుపై పరిశీలించగా ఎడతెరిపి లేని వర్షంలో నోట్లు తడిసి రూ.2 వేల మేర పనికి రాకుండా పోయాయి. మిగిలిన రూ.22 వేల నగదును బాధితులకు అందజేశారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.12,454

స్వగ్రామాల్లో సంబురం!

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎంగా మల్లు భట్టి విక్రమార్కతోపాటు పలువురు మంత్రులు గురువారం హైదరాబాద్‌లో ప్రమాణస్వీకారం చేశారు. అయితే, ఏ జిల్లాకు దక్కని విధంగా ఖమ్మం జిల్లాకు మంత్రివర్గంలో అత్యధిక ప్రాధాన్యత లభించింది. మధిర నుంచి గెలిచిన మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగా, పాలేరు, ఖమ్మం నుంచి గెలిచిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా భట్టి, పొంగులేటి, తుమ్మల స్వగ్రామాల్లో సంబురాలు అంబరాన్నంటాయి. మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా పలువురిని పలకరించగా.. తమ గ్రామం నుంచి మంత్రులుగా ఎదగడం ఆనందంగా ఉందని చెప్పడంతో పాటు తద్వారా గ్రామాల అభివృద్ధి వేగంగా జరుగుతుందనే భావన వ్యక్తం చేశారు.

- మంత్రివర్గంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు
- భట్టి, పొంగులేటి, తుమ్మల స్వగ్రామాల్లో హర్షాతిరేకాలు
- గ్రామస్తులు అత్యున్నత స్థాయికి చేరడంతో అభినందనలు
- అభివృద్ధి విషయంలో మరింత దూసుకెళ్తాయని భావన



స్నానాల లక్ష్మీపురంలోని భట్టి విక్రమార్క ఇల్లు

అంచెలంచెలుగా ఎదిగిన భట్టి



మంత్రి భట్టి విక్రమార్క

వైరా: వైరా మండలంలోని మారుమూల గ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో జన్మించిన మల్లు భట్టి విక్రమార్క అంచెలంచెలుగా ఎదిగి ప్రభుత్వంలో కీలక నేతగా ఎదిగారు. రాష్ట్రంలో ఆ కుటుంబానికి మంచి పేరు ఉండగా.. ఇప్పుడు భట్టికి డిప్యూటీ సీఎం దక్కడంతో గ్రామం రాష్ట్ర స్థాయిలోనే గుర్తింపు సాధించినట్లయింది. ఇప్పటికే రాష్ట్రస్థాయి నేతగా ఎదిగిన ఆయన ఎమ్మెల్సీగా, మధిర నుండి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. వై.ఎస్ హయాంలో డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసి ఇప్పుడు రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయన స్నేహితులు, గ్రామస్తులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నారాయణపురంలోని పొంగులేటి ఇల్లు

నారాయణపురంలో ఆనందోత్సవాలు



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కల్లూరురూరల్: కాంగ్రెస్ ప్రచార కమిటీ కోకన్వీనర్, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో ఆయన స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురంలో ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి. తమ గ్రామస్తుడు రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంపై గ్రామస్తులు, ఆయన స్నేహితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కల్లూరు మండలం నుండి తొలిసారిగా శ్రీనివాసరెడ్డి మంత్రి పదవి దక్కింది. దీంతో నారాయణపురం గ్రామస్తులే కాక కల్లూరు మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాలేరు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయిన శ్రీనివాసరెడ్డి ఎదిగిన తీరుతో తాము గర్వపడుతున్నామని పలువురు చెప్పారు.



కొర్లగూడెంలో పొంగులేటి చదువుకున్న హైస్కూల్

వ్యవసాయంపై మక్కువ



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దమ్మపేట: దమ్మపేట మండలం గండుగులపల్లికి చెందిన ఖమ్మం ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావును మంత్రి పదవి వరించింది. గండుగులపల్లిలో పుట్టి పెరిగిన తుమ్మల రాజకీయాల్లోకి వెళ్లకముందు కుటుంబ వారసత్వంగా వచ్చిన వ్యవసాయం చేసేవారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం నుంచి గెలిచిన ఆయనకు రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో మంత్రి పదవి దక్కడంపై మండల వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కాగా, తుమ్మల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఇది ఐదోసారి కావడం విశేషం. రాజకీయంగా మంత్రి పదవులను అధిరోహించినా వారసత్వంగా వచ్చిన వ్యవసాయాన్ని మాత్రం తుమ్మల ఏనాడూ వీడలేదు. పని ఒత్తిడిలో ఉన్నప్పటికీ వ్యవసాయం ఎలా జరుగుతుందో ఎప్పటికప్పుడు ఆరా తీసేవారు. వారానికి ఒక్కసారైనా గండుగులపల్లి వచ్చి వ్యవసాయ క్షేత్రాలను స్వయంగా పరిశీలించేవారు. తుమ్మల వ్యవసాయ క్షేత్రంలో వరి, మొక్కజొన్న, పుచ్చ, ఆయిల్‌పామ్ తదితర పంటలు సాగు చేస్తుండగానే... అన్ని దశల్లోనూ పరిశీలించడం అలవాటుగా మార్చుకున్నారు. ఇక పంటమార్పిడి దిశగా ఆలోచన చేసిన తుమ్మల.. తన వరి పొలంలో ఆయిల్‌పామ్ సాగు చేసి మిగతా రైతులకు ఆదర్శంగా నిలిచారు.



గండుగులపల్లిలో మంత్రి తుమ్మల నివాసం



పామాయిల్ క్షేత్రంలో తుమ్మల (ఫైల్)

ఎంతో ఆనందంగా ఉంది.



మా గ్రామానికి చెందిన మల్లు కుటుంబం నుండి భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి రావడం సంతోషంగా ఉంది. మా గ్రామానికి రాష్ట్ర గుర్తింపు వస్తున్నందున ఆనందంగా ఉంది. గ్రామంలో ఆ కుటుంబం గురించే చర్చించుకుంటున్నారు. గ్రామాభివృద్ధి వేగంగా జరుగుతుందని ఆశిస్తున్నాం. – షేక్ అల్లాబాషు, స్నానాల లక్ష్మీపురం

ఆ కుటుంబం ఊరికి వన్నె తెచ్చింది..



మల్లు కుటుంబానికి రాష్ట్ర స్థాయి గుర్తింపు ఉంది. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా కాంగ్రెస్‌ను వీడకుండా కొనసాగడంతో ఇప్పుడు న్యాయం జరిగింది. ఏదిఏమైనా మా కుటుంబ సభ్యుడు డిప్యూటీ సీఎం పదవి అలంకరించడం ఆనందంగా ఉంది. ఆయన రాక కోసం మేము ఎదురుచూస్తున్నాం.

– మల్లు శాంతమ్మ, స్నానాల లక్ష్మీపురం

వేద ప్రజల అభ్యున్నతికి పాటుపడతాడు..



నా కుమారుడు మంత్రి అయ్యాడని తెలిసి సంతోషించాను. ఎప్పుడు ప్రజల్లో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్నాడు. పేదల అభ్యున్నతి కోసం పాటుపడతాడు. జిల్లాతో పాటు మా గ్రామం మరింత అభివృద్ధి చెందుతుంది. మా అబ్బాయి మంత్రి అవుతాడని నేను ఎప్పుడో అనుకున్నా.

– స్వరాజ్యమ్మ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తల్లి

విద్యార్థి దశ నుంచే రాణించాడు..



నేను, శ్రీనివాసరెడ్డి ఒకటి తరగతి నుంచి నారాయణపురం, అన్నపురెడ్డిపల్లి, పేరువంచ, కల్లూరుఖమ్మంలో కలిసే చదువుకున్నాం. విద్యార్థి దశ నుంచే శ్రీనివాసరెడ్డిలో నాయకత్వ లక్షణాలు ఉండేవి. అన్నిరంగాల్లో రాణించేవారు. గతంలో ఎంపీగా గెలిచి, ఇప్పుడు మంత్రి కావడం ఆనందంగా ఉంది.

– కీసర శ్రీనివాసరెడ్డి, నారాయణపురం

ఈ ప్రాంతానికి గర్వకారణం



పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర మంత్రి అయ్యాడని తెలిసి సంతోషపడ్డాం. ఈ ప్రాంత వ్యక్తి గొప్ప స్థాయికి ఎదగడం మా అందరికీ గర్వకారణం. ఆయనకు మా గ్రామం, మండలంలోని సమస్యలు, ప్రజలు ఇబ్బందులు తెలుసు. ఈ ప్రాంతాన్ని శ్రీనివాసరెడ్డి అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తాడనే నమ్మకం ఉంది.

– పొంగులేటి శ్యాంసుందర్‌రెడ్డి, నారాయణపురం

జిల్లాకు శుభ పరిణామం



గండుగులపల్లికి చెందిన తుమ్మలకు మంత్రి పదవి దక్కడం జిల్లాకు శుభపరిణామం. స్వయంగా రైతు అయిన ఆయన ఆయిల్‌పామ్ సాగు పెరిగేలా తోడ్పాటునిచ్చి, అప్పారావుపేటలో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి చేశారు. ఏజెన్సీ గ్రామాల అభ్యున్నతికి మరింత కృషి చేస్తారనే నమ్మకముంది.

– వట్టి వెంకట్రావు, గండుగులపల్లి

మరింత అభివృద్ధి జరుగుతుంది...



మా గ్రామానికి చెందిన తుమ్మల నాగేశ్వరరావుకు మరోసారి మంత్రి పదవి దక్కడం ఆనందంగా ఉందని అన్నారు. గతంలో మంత్రిగా పనిచేసినప్పుడు మండలంలోని ప్రతీ గ్రామానికి తాగునీరు, రోడ్డు సౌకర్యం కల్పించారు. ఈసారి మళ్లీ పదవి దక్కడంతో మరింత అభివృద్ధి చేసే అవకాశం ఉంది.

– ఎర్రా వసంతరావు, గండుగులపల్లి

అభినందనలు





హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎంగా జిల్లాకు చెందిన మల్లు భట్టి విక్రమార్క, మంత్రులుగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి భట్టి, పొంగులేటి, తుమ్మల శుభాకాంక్షలు తెలపగా ఆయన కూడా వారిని అభినందించారు. అలాగే, సీఎం, భట్టికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుభాకాంక్షలు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

ములకలపల్లి : వైన్‌షాపులో మద్యం మాయమైన ఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కమలాపురం గ్రామానికి చెందిన తోట సత్యప్రకాశ్ జగన్నాథపురం షాప్‌నెంబర్–1లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఈషాపులో సుమారు రూ. 12 లక్షల విలువైన మద్యం మాయమైంది. గుమస్తా సత్యప్రకాశ్‌తోపాటు తండ్రి తోట కొండల్‌రావు మద్యం అక్రమంగా తరలించినట్లు లైసెన్స్‌హోల్డర్ గడ్డం నాగరాజు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన రికార్డులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 6 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. దీంతో ఆ గదిలో ఉన్న ఫైల్స్ పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, టౌన్ సీఐ నాగరాజు రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి, బీజేపీ నాయకుడు కుంజా ధర్మా కార్యాలయాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. కాగా అగ్నిమాపక అధికారులకు ప్రమాద సమాచారం ఇవ్వడంలో కార్యాలయ సిబ్బంది అలసత్వం వహించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

సమగ్ర చట్టం కోసం పోరాడుతా..

ఎంపీ నామ నాగేశ్వరరావు



ఎంపీ నామను కలిసి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: వ్యవసాయ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం సమగ్ర చట్టాన్ని తీసుకువచ్చేలా పోరాడుతానని బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామ నాగేశ్వరరావు తెలిపారు. న్యూఢిల్లీలో గురువారం ఆయనను ఖమ్మం నుంచి వెళ్లిన వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధి బృందం కలిసింది. ఈ సందర్భంగా రైతులు, రైతు కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉపాధి హామీ పథకంలో ఎదురవుతున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం నామ మాట్లాడుతూ తాను రైతు బిడ్డనని, వ్యవసాయం కోసం రైతు, కూలీలు ఎంత కష్టపడతారో తెలుసునని చెప్పారు. ఇప్పటికే పార్లమెంట్‌లో పలుమార్లు రైతు వ్యతిరేక చట్టాలపై మాట్లాడానని తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో సంఘ నాయకులు మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు, నందిపాటి మనోహర్, సాగర్, కే.వీ.రెడ్డి, రాధాకృష్ణ, లక్ష్మణరావు, వేణు, బంధం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పీఏసీఎస్ డైరెక్టర్ వీరయ్య మృతి

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన అశ్వాపురం పీఏసీఎస్ డైరెక్టర్, టీడీపీ సీనియర్ నాయకుడు కందుల వీరయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. వీరయ్య మృతి పట్ల డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, సర్పంచ్ బాణోత్ శారద, పీఏసీఎస్ సీఈఓ వెంకటేశ్వర్లు, ముత్తినేని వాసు, వేములపల్లి రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు తుళ్లూరి ప్రకాష్ సంతాపం వ్యక్తం చేశారు.

రచయిత్రి చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ కన్నుమూత

- అభినవ మొల్ల, కవికోకిల వంటి బిరుదులు సొంతం
- సంతాపం తెలిపిన ప్రముఖులు, కవులు, రచయితలు



డాక్టర్ చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ (ఫైల్)

భద్రాచలంటౌన్: తెలంగాణ ప్రభుత్వం నుంచి రాష్ట్ర విశిష్ట మహిళా పురస్కారం అందుకున్న ప్రముఖ కవయిత్రి, అభినవ మొల్ల భద్రాచలం పట్టణానికి చెందిన డాక్టర్ చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ గురువారం కన్నుమూశారు. భద్రాచలానికి చెందిన పాడిచేటి వీర రాఘవాచార్యులు – నరసమాంబ దంపతులకు 1939 జనవరి 3న జన్మించిన ఆమెకు చిన్నతనంలోనే వివాహం కాగా, వివాహ జీవితం సరిగా సాగలేదు. దీంతో పుట్టింట్లో ఉండి ప్రైవేట్‌గా ఆంధ్రా మెట్రిక్ పాసయ్యారు. ఎస్‌జీబీటీ పూర్తి చేసి భద్రాచలం మల్టీపర్పస్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. ఉద్యోగం చేస్తూనే పీయూసీ, బీఏ, ఎంఏ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. ఈక్రమంలో మహాత్మాగాంధీ మరణవార్త విని 'భారత జనకుడు ఇకలేరు, గాంధీ తాత ఇకలేడు' అంటూ తన తొలి కవిత రాశారు. అనంతరం ఆమె రాసిన పలు కవితలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. 1964లో భద్రగిరి, మహాకవి దాశరథి, 1981లో రామదాసు పద్య కావ్యం రాశారు. ఈ రచనలకు కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి అభినవ మొల్ల బిరుదుతో సత్కరించారు. అప్పటి నుంచి ఆమె వెనుతిరిగి చూడలేదు. మొత్తం 22 పద్య, గద్య కావ్యాలు రచించిన డాక్టర్ చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ రాష్ట్రీయ, జాతీయ స్థాయిలో అనేక బహుమతులు, పురస్కారాలు అందుకున్నారు. ఆమె మరణ వార్త తెలుసుకున్న పలువురు ప్రముఖులు, కవులు, రచయితలు నివాళులర్పించారు.

ఉదయం విధుల్లో.. సాయంత్రం విగతజీవిగా..

రోడ్డుప్రమాదంలో మృతి చెందిన ఉద్యోగి



సీపీ వారియర్‌కు సాయుధ దళాల టోపీ అందజేస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం రూరల్: ఉదయం ఉత్సాహంగా విధుల్లో పాల్గొన్న ఆ ఉద్యోగి.. సాయంత్రానికి విగతజీవిగా మారడంతో కుటుంబంతో పాటు సహోద్యోగుల్లో విషాదాన్ని నింపింది. ఖమ్మంలోని రీజనల్ సైనిక్ వెల్ఫేర్ ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కల్లూరి శ్రీనివాసరావు గురువారం ఉదయం కార్యాలయంలో జరిగిన సాయుధ దళాల పతాక దినోత్సవంలో మాజీ సైనిక అధికారులు, మాజీ సైనికులు, ఎన్‌సీసీ కేడెట్లతో కలిసి పాల్గొన్నారు. పతాకావిష్కరణ అనంతరం కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్‌ను కలిసి సాయుధ దళాలకు సంబంధించిన టోపీ ధరింపచేశారు. సాయంత్రం విధులు ముగిశాక కరుణగిరిలోని టీఎన్‌జీఓస్ కాలనీలో ఇంటికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. కాసేపట్లో ఇంటికి చేరుకుంటాడనగా కరుణగిరి సమీపాన మున్నేరు బ్రిడ్జి వద్ద ఆయన వాహనాన్ని జేసీబీ తగలడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, శ్రీనివాసరావు మృతిపై జిల్లా సైనిక సంక్షేమాధికారి కొండపల్లి శ్రీరామ్, ఉద్యోగులు, మాజీ సైనికులు సంతాపం ప్రకటించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఖమ్మం రూరల్ ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

కామేపల్లి: పురుగుల మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలంలోని బర్లగూడెంకు చెందిన ధరావత్ వాలీ(48) కొద్ది రోజులుగా మద్యానికి బానిసై బుధవారం పురుగుల మందు తాగింది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా గురువారం పరిస్థితి విషమించి మృతి చెందింది. వాలీ కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.